
ఈ వారం కథ

- బి.పుల్లయ్య

# థార్ ఎడారిలో ఒక అద్భుతం



**శ్రీశైలంలో ప్రొఫెసర్ నందగోపాల్ అంతర్ధానమైనట్లుగా ప్రముఖ తెలుగు దినపత్రికలలోని వార్త నాకు చాలా బాధను కలిగించింది. ప్రొఫెసర్‌గారి మిత్రులకు, పరిచయస్థులకు, శిష్యులకు ఈ వార్త బాధాకరమైనదే. నేను వెంటనే ఆయన శిష్యుడు లెక్చరర్ వేంకటేశ్వర శాస్త్రిని ఫోన్‌లో కాంటాక్ట్ చేశాను. నిజమేనని శాస్త్రి ధ్రువీకరించాడు. నేను వెంటనే శ్రీశైలం వెళ్లడానికి కర్నూలు వైపు బయల్దేరాను.**

ప్రొఫెసర్ గారితో నాకు చాలా ఏళ్ళుగా పరిచయం. గొప్ప స్నేహశీలి. పురావస్తు శాస్త్ర పరిశోధకుడు. సంస్కృత భాషలో పాండిత్యం గలవాడు. ప్రాచీన శిలా శాసనాలను చదవడంలో, పరిష్కరించడంలో గొప్పగా అనుభవం కలవాడు. మన విశ్వవిద్యాలయాలలో పురావస్తు, ఇండాలజీ శాఖలకు విజిటింగ్ ప్రొఫెసర్. తరచుగా దేవస్థానం ఆహ్వానం మీద శ్రీశైలానికి వస్తూ ఉంటాడు. అలా వచ్చినప్పుడు శాసనాల పరిశీలనలకే పరిమితం కాకుండా, ఓషధులు వనమూలికల పరిశోధనలు కూడా నిర్వహిస్తూ ఉంటాడు. ప్రాచీన ఆయుర్వేద శాస్త్రజ్ఞులైన అగ్నివేశుడు, చరకుడు, సుశ్రుతుల గ్రంథాలతో పరిచయమేగాక ప్రాచీన శాసనాలలో పేర్కొన్న ఔషధాల గురించిన అంశాలు ఆయనకు కరతలామలకం. ఆయన దగ్గర శివన్న అనే సేవకుడున్నాడు. ఆయనకు కావలసిన భోజన సదుపాయాలను సమకూర్చడమే కాక చెంచు వైద్యులు వాడే వనమూలికలు, చిట్కాల వివరాలను కూడా తెలియజేస్తూ ఉంటాడు.

తనకు ఏమీ తోచనపుడు అక్కడికి వచ్చి రెండు మూడు రోజులు ఉండి పోవలసిందిగా నాకు తరచూ ఉత్తరాలు రాస్తూ ఉంటాడు. ఆయన ఆహ్వానం మీద రెండు మూడు పర్యాయాలు శ్రీశైలానికి వెళ్ళాను కూడా. అలాంటి స్నేహశీలి కనపడటం లేదని తెలుసుకున్న వెంటనే కర్నూలులోని మిత్రుడు వేంకటేశ్వర శాస్త్రికి ఫోన్ చేసి కర్నూలుకు బయల్దేరాను. కర్నూలులో శాస్త్రి నాతో కలిసి శ్రీశైలానికి ప్రయాణమయ్యాడు.

శ్రీశైలం చేరిన వెంటనే ప్రొఫెసర్ నందగోపాల్ ఇంటికి వెళ్లాం. సేవకుడు శివన్నతో ప్రొఫెసర్ అంతర్ధానం వివరాలు సేకరించే ప్రయత్నం చేశాం. ప్రొఫెసర్ స్టడీరూంను పరిశీలించగా క్రీ.శ.రెండు మూడు శతాబ్దాలకు చెందిన శాసనాల నకళ్ళు కనిపించాయి. పుస్తకాల రాక్‌లో ఆర్కియాలజీకి, ఇండాలజీకి, శాసనాలకు సంబంధించిన గ్రంథాలెన్నో ఉన్నాయి. ఆయన తన పరిశోధనల గురించి తరచూ రాసుకున్న నోట్సును చూశాం. నోట్సులో ఆయన పరిశీలిస్తున్న మూలికల వివరాలు కూడా ఉన్నాయి. ఒక చోట తన పరిశోధన ఫలించిందని, తాను ఒక గొప్ప ఔషధాన్ని కనిపెట్టగలిగానని పేర్కొన్నాడు. ఆయన రాసుకున్న డైరీ కూడా దొరికింది.

గడిచిన వారంలో ప్రొఫెసర్ దినచర్యల గురించి తన సేవకుడు శివన్నను ప్రశ్నించాం. ప్రతిదినం బ్రేక్‌ఫాస్ట్ తరవాత తుపాకి తీసుకొని భీముని కొలను వెళ్ళే కాలిబాటపై సుమారుగా ఒక కిలోమీటరు దూరం వెళ్ళే అలవాటుందని, ఆ దినం కూడా తుపాకి తీసుకొని అటువైపే వెళ్ళాడని శివన్న తెలిపాడు. సుమారు ఒక గంట తరువాత ఆ ప్రాంతం నుండి తుపాకి పేల్చిన శబ్దం విన్నానని చెప్పాడు. తరువాత శివన్న ఇంటికి వెళ్ళి ప్రొఫెసర్ గారు భోజనం చేసే సమయానికి తిరిగి వచ్చాడు. వారికి భోజనం వడ్డించాడు. అడవిలో ఏవైనా విశేషాలుంటే ప్రొఫెసర్‌గారు చెప్పేవాడు. ఆ రోజు అటువంటివేవీ చెప్పలేదని తెలిపాడు. మరునాడు ఉదయాన్నే ప్రొఫెసర్ అంతర్ధానమయ్యాడు. ఆయనతోపాటు తరచుగా ఇంటిలో అటూ ఇటూ తిరిగే పిల్లి కూడా కనిపించడం లేదని విచార వదనంతో పేర్కొన్నాడు శివన్న.

నేను, శాస్త్రీ శివన్న సూచనల ప్రకారమే భీముని కొలను మార్గంలో బయలుదేరాం. శ్రీశైలం అడవులు వనమూలికలకు నెలవు. కనుక ప్రొఫెసర్ ఆ అడవి మార్గం గుండా వెళ్ళాడేమో. లతలు, గుల్మాలు, వృక్షాలతో వుండిన మనోహర దృశ్యం మా కనులకు విందు చేసింది. లతల, పువ్వుల సువాసనలు ఆఘ్రాణిస్తూ ముందుకు వెళుతున్న మమ్మల్ని చూసి యేదుపందుల గుంపులు ముందుకు వెళ్ళాక తమ కలుగుల లోనికి దూరాయి. చుట్టుపక్కల గమనిస్తూ వెళుతున్న మాకు వున్నట్టుండి దుర్గంధం సోకడంతో ఆ దుర్గంధం ఎటువైపు నుంచి వస్తోందా అని పరిశీలించాం. బాటకు అటు ఇటుగా తెల్లని నల్లని వెంట్రుకల కుచ్చులు వెదజల్లబడినట్లు చూశాం. ఇంకా ముందుకు వెళ్ళేసరికి చచ్చిన పులిలాంటి ఆకారం గల జంతు కళేబరం కనిపించింది. ఆకారంలో పిల్లి కంటె భారీగా, పులి కంటె చిన్నదిగా వున్న ఆ జంతువేమై ఉంటుందో మాకు తెలీలేదు. ఆ చేరువలోనే తుపాకీ పడి వుండడాన్ని గమనించాం. బహుశా ఆ తుపాకి ప్రొఫెసర్‌దై ఉంటుందని, ఆ తుపాకితో ఆ జంతువును చంపి వుండవచ్చని భావించాం. శాస్త్రిగారు వెనుకకు మరలుదామని చెప్పడంతో ప్రొఫెసర్ ఇంటికి మరలి వచ్చాం.

ప్రొఫెసర్ ఎందుకు అకస్మాత్తుగా శ్రీశైలం వీడినట్లు? మా సందేహం, బహుశా తాను కనుగొన్న ఔషధాన్ని పరిశీలించడానికి బయల్దేరారేమో. ఎందుకైనా మంచిది మేము ప్రొఫెసర్‌ను వెదకడానికి బయలుదేరుతున్న విషయాన్ని రహస్యంగా ఉంచడం మంచిదేమో. ఆ డ్రగ్ ఫార్ములా కోసం ఏ విదేశీ ఫార్మస్యూటికల్ కంపెనీయో ప్రొఫెసర్ కోసం బయలుదేరి ఉండవచ్చు.

శివన్నతో మేము చూసిన జంతువును గురించి ప్రశ్నించగా అటువంటి జంతువు ఆ అడవులలో లేదని, పెద్ద పులులున్నా అవి జనవాసాలున్న ప్రాంతాలకు రావని చెప్పాడు. మేము అవసరమని భావించిన ప్రొఫెసర్ నోట్సును, డైరీని మాత్రం తీసుకొని, ప్రొఫెసర్‌ను వెదకడానికి వెళుతున్నామని, మేం తిరిగి వచ్చేదాకా ప్రొఫెసర్ ఇంటిని జాగ్రత్తగా కనిపెట్టుకొని ఉండవలసిందని శివన్నకు చెప్పి శ్రీశైలం నుండి బయల్దేరాం.

శాస్త్రి ఆదోనిలోని ప్రొఫెసర్ శిష్యుడు డాక్టర్ స్వామికి ఫోన్ చేశాడు. ప్రొఫెసర్ నాలుగు రోజుల క్రితం ఆదోనికి వచ్చాడని ఢిల్లీకి టికెట్ రిజర్వు చేసుకొని ఆ మరునాడే ట్రైన్‌లో వెళ్ళాడని చెప్పాడు. మేం వెంటనే ఆదోనికి బస్సులో బయల్దేరాం. డాక్టర్ స్వామిని కలిసి, అతని సహాయంతో స్టేషన్ కార్యాలయం నుండి ప్రొఫెసర్ ఏ స్టేషన్ దాకా టికెట్ తీసుకున్నదీ తెలుసుకొని అదే స్టేషన్‌కు టికెట్ తీసుకొని ట్రైన్‌లో బయల్దేరాం.

మాకూ ప్రొఫెసర్ ప్రయాణానికి మూడు రోజులు

తేడా ఉంది. రెండు రోజుల అనంతరం జోధ్‌పూర్ చేరాం. స్టేషన్ నుండి టాంగాలో ప్రసిద్ధి పొందిన మాడరన్ టూరిస్ట్ లాడ్జికి వెళ్ళాం.

జోధ్‌పూర్ రాజస్థాన్‌లోని మధ్యయుగానికి చెందిన ప్రసిద్ధ దుర్గాలలో ప్రముఖమైనది. ఒక భారీ శిలపై రాజపుత్ర కళాశైలితో నిర్మించిన దుర్గం. బురుజులు, కందకాలతో ముందుకు చొచ్చుక వచ్చినట్లున్న గంభీర భవనరాజం జోధ్‌పూర్ ప్యాలెస్. యోధులు, రసపుత్ర వీరులకెల్ల ప్రఖ్యాతి బడసినవారు. జోధ్‌పూర్ నుండి థార్ ఎడారి ప్రారంభమౌతుంది. పశ్చిమానికి వెళ్ళే కొద్దీ ఇసుకమేటలు వేసి దిబ్బలుగా ఎదురౌతుంది. ఎటు చూసినా ఇసుక దిబ్బలే తప్ప, ఆకుపచ్చని చెట్లు అగుపించవు.

మాకూ ప్రొఫెసర్ ప్రయాణానికి మధ్యన రెండు రోజులు మాత్రమే తేడా వుంది. తేడాను తగ్గించడానికి వెంటనే ప్రయాణానికి సిద్ధపడ్డాం. లాడ్జి రిసెప్షనిస్టును విచారించగా ప్రొఫెసర్ రెండు రోజుల క్రితమే రూం ఖాళీ చేశాడని, సూట్‌కేసును తమకు అప్పగించి, తను తిరిగి వచ్చి తీసుకొంటానని లేదా తన లేఖతో వచ్చిన వారికి అందజేయాలని కోరినట్లు తెలిపాడు. మాకు ప్రొఫెసర్‌గారు బసచేసిన ఫస్ట్ ఫ్లోర్‌లోని 45వ నంబర్ గదినే ఇచ్చారు. రూం బాయ్ తోటి టీ తెప్పించుకొని, అతడిని మాటలలో దించాం. ఆ రూం బాయ్ సర్దార్ సింగ్. హిందీలోనే బాతాఖానీ సాగింది.

ప్రొఫెసర్ ఎలాంటి వాడని శాస్త్రి సర్దార్‌సింగ్‌ను ప్రశ్నించాడు. 'ప్రొఫెసర్ చాలా మంచివాడు. గొప్పగా బక్షీస్ ఇచ్చాడు. చేరిన రోజుననే ఎడారిలోనికి ప్రయాణమయ్యాడు. తగిన ఒంటెను బాడుగకు కుదర్చమని అతడికి చెప్పాడు. నేను మార్కెట్‌లో ఒంటెలను బాడుగకు ఇచ్చే చోటికి తీసుకువెళ్ళాను. ఎక్కువసేపు బేరమాడక ఒంటె యజమాని పేర్కొన్న బాడుగ ఇస్తానన్నాడు. షేర్‌ఘర్ వైపు సుమారుగా 50 కిలోమీటర్ల దూరంలో ఒయాసిస్సు దాకా వెళ్ళాలని చెప్పాడు. ఆ మరునాటి ఉదయమే ఆ ప్రాంతానికి బయల్దేరాడు' అన్నాడు సర్దార్‌సింగ్.

'సార్! రూంలో ఆయన కొన్ని కాగితాలను విడిచి వెళ్ళాడు వాటిని తీసుకువస్తా' అని చెబుతూ, ఐదు నిమిషాల్లో ఆ కాగితాలను తెచ్చాడు. ఆ కాగితాలలో తాను ఒక గొప్ప అద్భుతాన్ని సాధింప బయలుదేరుతున్నానని, విజయంతో తిరిగి రాగలననే విశ్వాసముందని తెలుగులో రాశాడు. కనుక ఆ విషయాల గురించి రూం బాయ్‌కి గాని, లాడ్జి నిర్వాహకులకు గాని తెలీదు. మేం కూడా అదే గ్రామానికి బయల్దేరుతున్నామని, మాకు కూడా ఒంటెను కుదర్చమని రూం బాయ్‌ని అడిగాం. సర్దార్ సింగ్ వెనుకటి లాగే మమ్మల్ని మార్కెట్‌లో ఒంటెల యజమానుల దగ్గరకు తీసుకువెళ్లాడు. ఈ పర్యాయం మరొక యజమానితో బాడుగ కుదిర్చాడు.

ఒంటె యజమాని రావల్‌సింగ్ మేమిద్దరం - మొత్తం ముగ్గురం ఒంటెల మీద మరునాటి ఉదయమే బయలుదేర బోతున్నాం. వేగంగా బయల్దేరితే ప్రొఫెసర్‌ని కలవొచ్చుని ధైర్యంతో ఉన్నాం. ఆ రోజు రాత్రే మాకు కావలసిన సరంజామా, పెద్ద వాటర్ బాటిల్స్, దప్పిక తీరడానికి టాబ్లెట్లు, సన్‌స్ట్రోకు లాంటివి వస్తే చికిత్సకు మందులు, తాత్కాలిక విడిదికి గుడారం, ఇసుక దుమారం నుండి కాపాడుకోటానికి శాలువలు మొదలైనవి సిద్ధం చేసుకున్నాం. మేం లాడ్జి మేనేజర్‌తో రూం ఖాళీ చేస్తున్నట్లు తెలిపి, రూం బాయ్‌కి బక్షీస్ ఇచ్చి కదిలాం. తెల్లవారక ముందే ఒంటెలపై పడమటి దిశగా థార్ ఎడారిలో ప్రయాణం ప్రారంభమైంది.

ఎక్కడ చూసినా ఇసుక దిబ్బలే. ఇసుక దిబ్బలలో ఒంటెపై ప్రయాణం మొదట్లో ఆటవిడుపుగా ఉంది. కాని పడమటి గాలులు మాకు చీకాకు కలిగించాయి. 5 కిలోమీటర్ల దూరం పయనించి ఒక కుగ్రామం చేరాం. అక్కడ ఒంటెకు నీళ్ళు తాగించాడు రావల్‌సింగ్. మేం కాళ్ళు



మేము లాడ్జిలో చూసిన కాగితాలలో పేర్కొన్న థార్ అద్భుతం ఇదే కాబోలు. భారీగా పెరుగుతున్న శరీరాన్ని గమనించి ఒంటె యజమాని భయపడి మరణించి వుండవచ్చు. ఉచ్ఛ్వాస నిశ్వాసల వలన రేగిన ఇసుక దుమారంలో చిక్కుకొని ఒంటె మరణించి ఉండవచ్చునని భావించాం. ఆ భారీ ఉచ్ఛ్వాస నిశ్వాసలే మాకు క్రితం దారిలో వినిపించిన సమర ఢంకా నగారాల శబ్దాలు. లబ్‌డబ్‌లు గుండె చప్పుళ్ళు.

ముఖం కడుక్కొని అక్కడ దొరికే మధుర పానీయాలు తాగి తిరిగి ప్రయాణం సాగించాం. రానురాను పడమటి గాలుల వేగం పెరిగింది. సుదూర ప్రాంతంలో ఆకాశాన్ని ఎగదన్నే రీతిలో ఇసుక పైకెగసింది. ఆ దుమారం రానురాను మాకు సమీపంగా వీస్తుంటే శాస్త్రి ఒకటే గగ్గోలు పెడుతున్నాడు. ఆ ఇసుక తుపాను భీకర శబ్దాలు శత్రుసైన్యాల ముట్టడికి వస్తున్నట్లు అనిపించాయి. ఒంటెల యజమాని రావల్‌సింగ్‌ను ఏమిటా శబ్దమని అడిగాం. అతడా శబ్దాలు తనకు కూడా కొత్తవేనని, కాని భయపడవలసిందేమీ లేదని ధైర్యం చెప్పాడు. మరి కొంత దూరం వెళ్ళాం. ఇప్పుడా శబ్దాలు మరీ ఎక్కువయ్యాయి. వాతావరణం రానురాను భయంకరంగా మారింది. మేము భయోత్పాతంతో మానసికంగా కృంగిపోయాం. అకస్మాత్తుగా ఆ శబ్దాలు ఆగిపోయి గాలి దుమారం తగ్గిపోయింది. 'ఏం భయం లేదు సార్' రావల్ సింగ్ అన్నాడు తనకు తాను ధైర్యం చెప్పుకుంటున్నట్లు. అల్లంత దూరంలో ఒక కోట లాంటి భవనం మాకు కనిపించింది. 'ఆ కోట ఏమిటి?' రావల్‌సింగ్‌ను ప్రశ్నించాడు శాస్త్రి.

'ఇలాంటి కోటను నేను ఈ ప్రాంతంలో చూడలేదు సార్' జవాబిచ్చాడు రావల్‌సింగ్.

మా ప్రయాణం ముందుకు సాగింది. దిబ్బలాంటి కోటను సమీపించాం. చేరువలోనే రెండు ఆర్చీలతో ఒక బ్రిడ్జిని చూశాం. ఆ బ్రిడ్జి సమీపంలోనే ఒక బలమైన తాడు లేక పగ్గాన్ని చూశాం. ఆ పగ్గం నూలు దారంతో పేనిందా లేక వెంట్రుకలతో తయారయిందా? అని సందేహం కలిగింది. దగ్గర్లోనే ఒక ఒంటె కళేబరం పడి ఉంది. అక్కడే ఇసుకలో శాలువలు, దుస్తులు పడి ఉన్నాయి. రావల్‌సింగ్ ఒంటెలను నిలిపాడు. ఒంటెల నుండి దిగి నీళ్ళతో ముఖాలు తుడుచుకున్నాం.

శాస్త్రి 'సార్! ఆ బ్రిడ్జి పైకి ఒకసారి వెళితే విశేషాలు తెలుసుకోవచ్చు కదా' అన్నాడు. ఆ ఆలోచన నాకు నచ్చింది. ఆ సమీపంలో ఎవరైనా మనిషి కనిపిస్తే ప్రొఫెసర్ గురించి వాకబు చేయవచ్చుని అనుకున్నాం. ఇద్దరం అటువైపు బయల్దేరాం. ఆ వారధి సమీపంలోని తాడును సమీపించాం.

మాకు ఆశ్చర్యమేసింది. అది సుమారు ఒక సెంటిమీటరు మందం ఉంది. వెంట్రుక అయితే అది ఏ భూతానిదో అయి ఉంటుంది. మనుషులదో జంతువులదో కాదని నిర్ధారించాం. బ్రిడ్జి ఆర్చీలను సమీపించే సరికి అది బ్రిడ్జా లేక కండరాలతో కూడిన శరీర అవశేషమా అనిపించింది. చేరువకు వెళ్ళాం.

ఆశ్చర్యం! అది బ్రిడ్జి కాదు. మనిషి ముక్కు. దగ్గరకు వెళ్ళి, ఇసుకను తొలగించడం ప్రారంభించాం. అది మనిషి తల. అంత పెద్ద తల ఏ భూతానిదోనని అనుకుంటూ ఇసుకను పూర్తిగా తొలగించి చూసేసరికి మమ్ము గొప్పగా ఆశ్చర్యంలో ముంచిన విషయం - అది మా ప్రొఫెసర్ నందగోపాల్ తల. ముక్కు దగ్గర చేతులుంచి శ్వాసను పరిశీలించగా అది అపుడపుడే నిలిచినట్లుంది. శరీరం తడితో కొద్దిగా వేడిగా ఉంది. మృతి చెంది కేవలం ఒక గంటలోపే అయి ఉంటుంది. సమీపంలోని వెంట్రుక ప్రొఫెసర్ గారిదే. అంటే ప్రొఫెసర్ గారి శరీరం 5 అడుగుల 5 అంగుళాల నుండి భారీగా ఒక చిన్న కొండంతగా పెరిగినదన్న మాట. చేరువలోనే ప్రొఫెసర్‌గారి డైరీ అందులో ఒక లేఖ దొరికింది.

మేము లాడ్జిలో చూసిన కాగితాలలో పేర్కొన్న థార్ అద్భుతం ఇదే కాబోలు. భారీగా పెరుగుతున్న శరీరాన్ని గమనించి ఒంటె యజమాని భయపడి మరణించి వుండవచ్చు. ఉచ్ఛ్వాస నిశ్వాసల వలన రేగిన ఇసుక దుమారంలో చిక్కుకొని ఒంటె మరణించి ఉండవచ్చునని భావించాం. ఆ భారీ ఉచ్ఛ్వాస నిశ్వాసలే మాకు క్రితం దారిలో వినిపించిన సమర ఢంకా నగారాల శబ్దాలు. లబ్‌డబ్‌లు గుండె చప్పుళ్ళు. క్రితం తాను వనమూలికలతో తయారుచేసిన ఔషధాన్ని తన పిల్లిపై ప్రయోగించి ఫలితాన్ని గమనించిన ప్రొఫెసర్ మానవునిపై దాని ప్రభావాన్ని పరిశీలింపదలచి మన ప్రాంతాలకు దూరంగా థార్ ఎడారిని ఎంచుకున్నాడు. ఇతరులపై ప్రయోగించక తన ఔషధ పరీక్షకు తానే సమిధగా మారాడు. మేం వచ్చిన పని ముగిసింది. ప్రొఫెసర్ నందగోపాల్ ఆత్మకు శాంతి చేకూరాలని ఆశిస్తూ ఆఖరి దర్శనం గావించుకొని వచ్చిన దారినే వెనుకకు ప్రయాణమయ్యాం. డైరీలో దొరికిన లేఖ ద్వారా లాడ్జిలోని ప్రొఫెసర్ సూట్‌కేసు తీసుకున్నాం.

ప్రొఫెసర్ గ్రంథాలు, పరిశోధనా పత్రాలు విశ్వవిద్యాలయాలలోని ఆయా శాఖలకు, ప్రొఫెసర్ సూచనల ప్రకారమే అందజేసి, వారి స్థిర చరాస్తులను సూచించిన విధంగానే పంచాం. సేవకుడు శివన్నకు కొంత ధనాన్ని ఇచ్చాం.

ప్రొఫెసర్ నందగోపాల్ - ఇర్వింగ్ వాలెస్ రాసిన 'ది ఫిజిషియన్ ప్రాజెక్ట్' నవలలోని హీరో మాక్‌డొనాల్డ్‌లా ఒక గొప్ప ఔషధాన్ని కనుగొని అది మానవ జాతికి అపకారం గావిస్తుందని భావించి, తనతో బాటుగా ఆ ఔషధాన్నీ, తయారీ విధానాన్ని నాశనం చేసిన ధీమంతుడు, మానవతా వాది.

★